# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత నౌకాదళం ఆత్మనిర్భరత దిశగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పాల్గొంటారు.**

2. **తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **ముంబయిలో జరిగే 12వ సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ –2025లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు పాల్గొంటారు.**

5. **ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

===========================

భారత నౌకాదళం ఆత్మనిర్భరత దిశగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" 128 సంచికలో పలు అంశాలపై నిన్న ప్రసంగించారు. డిసెంబర్ 4వ తేదీన నౌకాదళ దినోత్సవం గురించి ప్రధానమంత్రి వివరిస్తూ.. విశాఖపట్నం గురించి ప్రస్తావించారు. భారతీయ నౌకాదళంతో ముడిపడిన ఒక సబ్‌మెరైన్, హెలీకాప్టర్, ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం విశాఖపట్నంలో ఉందని, దేశ సాయుధ చరిత్ర పట్ల ఆసక్తి ఉన్నవారందరూ నౌకాదళ మ్యూజియాలను చూసేందుకు వెళ్లాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని గొల్లగూడెం గ్రామంలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తారు. నల్లమాడులో ప్రజావేదిక సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గత రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ నెల పింఛన్ల కోసం ప్రభుత్వం

దాదాపు 2 వేల 738 కోట్ల రూపాయలను విడుదల చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులందరు పాల్గొనాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రులు, శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులతో ముఖ్యమంత్రి నిన్న శ్రవణ మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుపరిపాలన ప్రభుత్వ విధానమని, సంక్షేమ కార్యక్రమాలు అందించడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

---------------------------

తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుపై హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులతో ఆయన నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వాణిజ్యం, క్రీడలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం వంటి అన్ని రంగాల అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలు తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రంలో ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

తమిళనాడు, పుదుచ్చేరి తీరం వెంట ఉత్తరం దిశగా కదులుతున్న దిత్వా తుపాను నిన్న సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని, ఈరోజు ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి జగన్నాథకుమార్ తెలియజేస్తూ,

వాయిస్ .. 29 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలో ఈరోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

మహారాష్ట్ర ముంబయిలో జరిగే 12వ సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ -2025లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు పాల్గొంటారు. ఈసందర్భంగా కృత్రిమ మేధ ఏఐ నేపథ్యంలో మీడియా, వినోద రంగం భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించే కార్యక్రమంలో పాల్గొని మంత్రి ప్రసంగిస్తారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో చలనచిత్ర పరిశ్రమ బలోపేతానికి ప్రభుత్వం తీసుకువచ్చిన "నూతన ఫిల్మ్ పర్యాటక విధానం"పై సదస్సులో వివరించనున్నారు.

---------------------------

ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహనా దినాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారులు విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 1988 సంవత్సరం నుండి ఏటా డిసెంబర్ 1వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. 'ఎయిడ్స్ సంక్షోభాన్ని అధిగమిస్తూ.. కొత్త మార్గంలో పయనిస్తూ" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహనా దినాన్ని నిర్వహిస్తున్నారు

---------------------------

ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి అవగాహన దినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు పాల్గొంటారు. అలాగే ఈ ఉదయం 9 గంటలకు విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నుండి "తుమ్మలపల్లి కళాక్షేత్రం" వరకు జరిగే ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో మంత్రితో పాటు స్థానిక శాసనసభ్యులు ఇతర అధికారులు పాల్గొంటారని వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

తెలంగాణలో హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 3వ తేదీన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగే బహిరంగ సభకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తారని మంత్రి వెల్లడించారు.

---------------------------

దిత్వా తుఫాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. తుఫాను దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులతో అమరావతి నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా  నిన్న సమీక్ష నిర్వహించారు.

=====================